
ప్రజాశక్తి
బుధవారం 21 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం



## జాబ్‌మేళాలో 37 మంది ఎంపిక

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానికశ్రీ వేంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ ఆవరణంలో వైఎస్‌కె ఇన్ఫోటెక్, వారాహ కంపెనీలతో మినీ జాబ్ మేళా మంగళవారం నిర్వహించారు. ఈ మేళాకు సుమారు 103 మంది అభ్యర్థులు హాజరు కాగా, 37మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్. చలపతిరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది ఏడోసారి అని ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. డిపిఆర్ఒ రమేష్ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. జాబ్ మేళాకు డిఐసి జిఎం సీతారాం, ఎడిఎం మూర్తి, ఎపిఎస్ఎస్‌డిసి సిబ్బంది పాల్గొన్నారు.



శ్లాబ్‌లెవెల్‌లో నిర్మాణమైనా బిల్లు మంజూరు కాని సర్పంచి ఇల్లు

**ఉపాధి హామీ చట్టం పని చేస్తున్న కూలీలకు జరుగుతున్న మేలు కన్నా అవినీతి అధికారులకు కాసులు కురిపించే కల్పవృక్షంలా మారుతోంది. అమాయకులైన, నిరక్షరాస్యులైన గిరిజన కూలీల శ్రమదోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి జిల్లా అధికారుల వరకు ఈ అవినీతి బాగోతంలో వాటాదారులుగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆఖరుకు గ్రామసర్పంచిని కూడా విడిచిపెట్టని పరిస్థితి. ఈ అవినీతిపై బాధితురాలైన గ్రామసర్పంచి ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేసినా నేటికీ ఎలాంటి చర్యల్లేవంటే వీరి అవినీతికి రాజకీయ అండదండలో ఏ స్థాయిలో ఉన్నాయో. సాక్షాత్తూ డిప్యూటీ సిఎం ఇలాకాలో గిరిజనులు దోపిడీకి గురవుతున్నారంటే మిగతా ప్రాంతాల్లో ఉపాధిహామీ అధికారుల ఆగడాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.**

# 'ఉపాధి'లో గిరిజనుల శ్రమదోపిడీ

- బిల్లుబిల్లుకీ వెయ్యి వసూలు
- జగనన్న ఇంటిపనికి రూ.5 వేలు డిమాండ్
- డెన్సరాయిలో టిఎ అంతులేని అవినీతి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని గిరిశిఖర గ్రామం డెన్సరాయి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉపాధి పనులకు బిల్లుల మంజూరులో సంబంధించిన గ్రామ పంచాయతీ టెక్నికల్ అసిస్టెంట్ వై.చినతిరుపతిరావు అవినీతికి అడ్డూఅదుపూ లేకుండా పోయింది. బిల్లులు చెల్లించినప్పుడల్లా ఆయన ఒక్కో గిరిజన కూలీ నుంచి వెయ్యి రూపాయలు చొప్పున వసూలు చేశారని స్థానిక గిరిజనులే చెపుతున్నారు. గ్రామాల్లో రహదారి, భూమి అభివృద్ధి పనులు ఉపాధి హామీ చట్టం కింద చేసినట్లు తెలిపారు. సర్పంచ్ మామిడి చిన్నమ్మితో పాటు వారు సోమవారం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌కు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. డెన్సరాయి పంచాయతీ పరిధిలో రేవడివలస, మర్రివలస, కొత్తూరు, ఎగువరూడి, డెన్సరాయి గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 12 ఉపాధి కూలీల గ్రూపులున్నాయి. ఈ పంచాయితీకి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావే అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల అండతో ఆయన ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా ఇక్కడ సాగుతోంది. అవినీతి, అక్రమాలపై స్థానిక గిరిజన యువకులు ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోవాలని, తనకు పై అధికారుల మద్దతు ఉందని ఆయన ఢంకా బజాయించి చెపుతున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉపాధి పనులు చేసిన గిరిజన కూలీలు 30మంది వద్ద నుంచి వెయ్యి రూపాయలు చొప్పున టెక్నికల్ అసిస్టెంట్ వసూలు చేశారని సర్పంచ్‌తో పాటు కూలీలు ఫిర్యాదు చేశారు. పంచాయితీ పరిధిలో 28మందికి జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. ఎగువ రూఢిలో ఎనిమిది మంది గిరిజనులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. లబ్దిదారులు చెదల లక్ష్మి, మర్రి శ్రీను శ్లాబ్ వరకు ఇళ్లు నిర్మాణం చేశారు. మర్రి రాజు, మర్రి డోంబు, కొర్ర పాల్గో లబ్దిదారులు తొమ్మిది అడుగుల గోడ వరకు నిర్మించారు. వీరికి ఉపాధి హామీ చట్టం నుంచి మట్టిపని చేసినట్లు మస్తర్లు వేసి ఒక్కో లబ్దిదారునికి రూ.30వేలు వరకు మంజూరు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80వేలు చొప్పున మంజూరు చేస్తుండగా ఉపాధి హామీ చట్టం కింద రూ.30వేలు మంజూరు చేయాలి. ఇంటి పునాదుల నిర్మాణానికి గోతులు తీసినందుకు, మరుగుదొడ్డి నిర్మాణానికి సంబంధించి గోతులు తీసినందుకు ఉపాధి హామీ చట్టం కింద ఒక్కో లబ్దిదారునికి రూ.30వేలు చొప్పున మంజూరు చేయాల్సి ఉంటుంది. ఈ డబ్బులు మంజూరు చేయడానికి ఒక్కో గిరిజన లబ్దిదారుడు రూ.5వేలు అడ్వాన్స్‌గా చెల్లించాలని తిరుపతి రావు డిమాండ్ చేస్తున్నారు. రూ.ఐదు వేలు ఇవ్వనిదే రూ.30వేలకు సంబంధించి పని చేసినట్లు మస్తర్లు వేయనని ఖరాకండీగా చెప్పినట్లు గిరిజనులు వాపోతున్నారు. ఆఖరుకు సర్పంచ్ ఇంటికి కూడా బిల్లు చెల్లించడానికి రూ.ఐదు వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసినట్లు ఆమె తెలిపారు. రాజకీయ పలుకుబడి ఉన్న టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు అవినీతి పై గిరిశిఖర గ్రామాల గిరిజనులు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ స్పందించిన దాఖలాలు లేవు. అవినీతి లేని ప్రభుత్వమని చెబుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొరైనా స్పందించి తమ నుంచి అక్రమంగా డబ్బులు గుంజుతున్న ఉపాధిహామీ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

### బిల్లు మంజూరుకు ఐదువేలు అడిగారు

జగనన్న పేదల ఇళ్ల నిర్మాణం కింద మంజూరైన ఇంటిని శ్లాబ్ వరకు నిర్మించాం. ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేయాల్సిన రూ.30వేలు చెల్లించడానికి రూ.ఐదువేలు ముందుగా ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతి రావు డిమాండ్ చేస్తున్నారు.



**చెదల లక్ష్మి,**
**లబ్ధిదారు, ఎగువరూడి.**

### ఆధార్ పేమెంట్‌తో దోపిడీ

టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు గిరిశిఖర గ్రామాల గిరిజనులను శ్రమదోపిడీకి గురి చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆధార్ కార్డు ద్వారా గిరిజన కూలీలకు చెల్లింపులు కూడా ఆయనే స్వయంగా చేస్తుండడంతో ఆయన వసూళ్లకు అడ్డు లేకుండా పోయింది. సెల్ ఫోన్ సిగ్నల్స్ వచ్చే ప్రాంతానికి ఊరికి దూరంగా గిరిజనులను తీసుకెళ్లి ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం ద్వారా ఉపాధి కూలీ డబ్బులు చెల్లింపు చేస్తున్నారు. ఒక వైపు టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఆయన ఆధార్ కార్డు చెల్లింపులు చేసే పని నిర్వహిస్తున్నట్లు గిరిజనులు చెపుతున్నారు. తన కుటుంబ సభ్యుల పేరిట ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం ద్వారా చెల్లింపులు చేయడానికి అనుమతి పొందిన ఆయన చదువులేని గిరిజనులను బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### బిల్లు ఇచ్చినప్పడల్లా వెయ్యి తీసుకుంటున్నారు

ఉపాధి హామీ చట్టం కింద చేసిన పనులకు సంబంధించి బిల్లుల మంజూరు చేసినప్పుడల్లా వెయ్యి రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారు. ఎందుకని అడిగితే పని చేయకుండా బిల్లు మంజూరు చేస్తున్నానని, అందుకే వెయ్యి రూపాయలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



**మామిడి చిన్నమ్మి,**
**సర్పంచ్, డెన్సరాయి.**

ఇష్టారాజ్యంగా

# ఎరువులు, విత్తనాల విక్రయం

- జిల్లా కేంద్రంలో బయటపడ్డ అనధికారిక అమ్మకాలు
- గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి
- అవగాహన లోపంతో నష్టపోతున్న రైతన్న

ప్రజాశక్తి - కలెక్టరేట్

**జిల్లాలోని రైతాంగం తొలకరి పంటకు సిద్ధమవుతుంది. ఇదే అదునుగా వ్యాపారులు కూడా ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు జరుపుతున్నారు. సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పార్వతీపురం పట్టణంలో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో బయటపడ్డ సరుకులే ఇందుకు నిదర్శనం. స్థానిక జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న షాపుల్లోనే ఇన్ని అక్రమాలు జరుగుతుంటే ఇతర పట్టణాలు, మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. దీనంతటికీ వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యమేనని రైతులు ఆరోపిస్తున్నారు.**

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఇటువంటి సమయంలోనే నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందుల విక్రయాలు జోరుగా సాగుతాయి. పల్లె, పట్టణం అన్న బేధం లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ అనుమతులు లేకుండా ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చాలా గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే వ్యాపారులు నకిలీ పురుగు మందులను, విత్తనాలను విక్రయిస్తున్నారు. అదేవిధంగా దళారీ వ్యాపారులు కూడా డీలర్ల వద్ద ఎక్కువ మొత్తంలో ఎరువులు, పురుగు మందులు విక్రయించి, ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మకాలు జరుపుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు కూడా దళారీలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల అవగాహనా లోపాన్ని వ్యాపారులు అవకాశంగా తీసుకొని జిల్లాలో నేటికీ చాలామంది వ్యాపారులు రైతులకు నాసిరకం ఎరువులు, నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. కొంతమంది రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పేర్లు పట్ల కాస్తో కూస్తో పరిజ్ఞానం ఉన్నప్పటికీ బిల్లులు, నకిలీ, నిల్వకాలం తదితరు విషయాల పట్ల అవగాహన లేదు. దీంతో చాలామంది వ్యాపారులు ఇదే అవకాశంగా తీసుకొని రైతులు నుండి సొమ్ము దోచుకుని నాసిరకం, కాలంచెల్లిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సమయంలో వ్యవసాయశాఖాధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి. లేకుంటే నకిలీ విత్తనాలను కొన్న రైతులు కొన్ని రోజుల తర్వాత అవి మొలకత్తకపోవడంతో లబోదిబోమంటూ మొర పెట్టుకోవడం తప్ప చేసేదేమీ ఉండదు. అలాగే అనధికారికంగా విక్రయాలు, నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొని రైతాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మట్టి ట్రాక్టర్లు పట్టివేత

### ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో గత కొద్ది రోజుల నుంచి చెరువుల్లో మట్టిని కొంత మంది వ్యక్తులు ఇష్టానుసారంగా తవ్వుతుండడంతో దానిపై మంగళవారం 'ప్రజాశక్తి'లో వార్త ప్రచురించడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఇరిగేషన్ డిఇఇ దమలపాటి వెంకటరమణ మండలంలో ఓని రోడ్డులో బత్తులవాని చెరువు దగ్గర ఎటువంటి అనుమతుల్లేకుండా రవాణా చేస్తున్న 4 మట్టి ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లు పివి రమణ అనే వ్యక్తికి చెందినవిగా గుర్తించారు. వీటిని తహశీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. ఎటువంటి అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తవ్వితే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

# ముందస్తు ప్రణాళికతో జగనన్న సురక్ష

ప్రజాశక్తి -కలెక్టరేట్

జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జగనన్న సురక్ష, గృహనిర్మాణం, ప్రాధాన్యత భవనాల నిర్మాణాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈనెల 23న ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని, జిల్లాలో ఈనెల 24 నుండి ప్రారంభిస్తామన్నారు. అందుకుగాను సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రతిఇంటికీ వెళ్లి ప్రజలకు గల అవసరాలను ముందుగా తెలుసుకొని, సమస్యలను యాప్‌లో అప్లోడ్ చేసి, మండల టీం వచ్చే సమయానికి సర్టిఫికెట్లు పంపిణీ, ఇతర సమస్యల పరిష్కారానికి ముందస్తుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియపై సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు ముందస్తుగా అవగాహన కల్పించాలని తెలిపారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లాలో పట్టణ ప్రాంతంలో 27,142 ఇళ్లు మంజూరు కాగా అందులో ఇంకా 4100 గ్రౌండింగు కాలేదని, వారం రోజుల్లో గ్రౌడింగు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో 7306 ఇళ్లు మంజూరు కాగా, ఇంకా 1600 ఇళ్లు గ్రౌండింగు చేయాలని, వాటిని గ్రౌండింగు చేసి నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో గల ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు సెప్టెంబరు 15 నాటికి పూర్తిచేయాలన్నారు. జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలు సాగు కార్డులు జిల్లాకు 5125 లక్ష్యంగా నిర్ణయించారని, లక్ష్యానికి మించి కౌలురైతులకు కార్డులు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 25 నాటికి సచివాలయం పరిధిలో గల గ్రామాల్లో కనీసం ఒకటి చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు. డిసిసిబి బ్యాంకు లావాదేవీల రిజిస్ట్రేషన్లు కూడా గ్రామాల్లో చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పోలవరం నిర్వాసితుల

# మహా పాదయాత్రకు సహకరించండి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్

సిపిఎం రాష్ట్రకమిటీ ఈనెల 20నుంచి జులై 4 వరకు తలపెట్టిన పోలవరం నిర్వాసితుల మహాపాదయాత్రకు జిల్లా ప్రజలు సంఘీభావం, సహకారం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులందరికీ పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించాలని, అందుకు అవసరమైన నిధులు తక్షణమే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జూన్ 20 నుండి జులై 3 వరకు సిపిఎం పాదయాత్ర నిర్వహిస్తుందన్నారు. ఈ పాదయాత్రలో ముంపు గ్రామాలకు చెందిన 500 మంది గిరిజనులు పాల్గొంటున్నారని, వీరికి సంఘీభావంగా వివిధ ప్రజా సంఘాలు, కార్యకర్తలు కూడా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ యాత్ర ఎటపాకలో ప్రారంభమై అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వందలాది గిరిజన గ్రామాల గుండా ఏలూరు, కృష్ణా జిల్లాలు దాటుకొని విజయవాడకు చేరుకుంటుందన్నారు. ఈ యాత్ర జయప్రదంగా జరగడానికి కనీస భోజన సదుపాయాలు ఏర్పాటుకు నిత్యావసర వస్తువులు అవసరం ఉందనీ, అలాగే వర్షాలు వచ్చే సమయం కావున యాత్ర సజావుగా సాగడానికి యాత్రలో పాల్గొనేవారికి గొడుగులు, రెయిన్ కోట్లు అవసరమవుతాయని అన్నారు. కావున పోలవరం నిర్వాసితులకు సంఘీభావం తెలుపుతూ ప్రజలు వారికి తోచిన రీతిలో సహాయం అందించాల్సిందిగా కోరారు. విరాళాలు పంపాల్సిన దాతలు విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయాన్ని సంప్రదించాల్సి మొబైల్ ఫోన్ నెంబర్లు ఇవే : మంతెన సీతారాం - 94900 98540, మర్లపాటి నాగేశ్వరరావు - 97042 65603, ప్రసాద్ - 94900 98562, నగదు అయితే పార్టీ అకౌంటుకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధరవు, కె.గంగునాయుడు, కె.అవినాష్, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, గొర్లి వెంకటరమణ ,రెడ్డి లక్ష్మీనాయుడు, మర్రి శ్రీనివాసరావు, కె.సాంబమూర్తి పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

# సాదాసీదాగా జగన్నాథ రథోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ ఏడాది పట్టణంలో జగన్నాథుని రథోత్సవం సాదాసీదాగా సాగింది. ఈయాత్రను పురస్కరించుకొని మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న జగన్నాథస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథ స్వామి రథం ఈ ఏడాది కూడా తయారు కాకపోవడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు కొద్ది మంది మాత్రమే ఆలయానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయంలో ఉన్న జగన్నాథ స్వామి, బలరామస్వామి సుభద్ర దేవి మూర్తులను అర్చకులు, ఒడియా బ్రాహ్మణులు ఆలయం నుండి తోడ్కొని వచ్చి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చిన్నపాటి రథంపై ఉంచి పాత బస్టాండ్ మీదుగా పాలకొండ రోడ్డు వద్ద ఉన్న గుడించా మండపం వరకు తీసుకువెళ్లి ఆ మండపంలో స్వామివారి మూర్తులను ప్రతిష్టించారు. ఈ తొమ్మిది రోజులు రోజుకొక అవతారంలో జగన్నాథస్వామిని అలంకరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ రథయాత్రను తిలకించేందుకు భక్తులు పెద్దగా ఆసక్తి చూపలేదని చెప్పవచ్చు. ఈ ఏడాది జగన్నాథుని ఆలయ కైంకర్య నిర్వహణ, రథయాత్ర ఉత్సవ ఊరేగింపు నిర్వహణపై దేవాదాయ శాఖ తీరు పట్ల పట్టణ ప్రజలు సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు.

**పాలకొండ:** పట్టణంలో జగన్నాథస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. 10 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు రథాన్ని ఆలయానికి ఎదురుగా నిలిపారు. యాత్రికులు వచ్చి పూజలు చేశారు.

**పార్వతీపురంరూరల్ :** మండలంలోని ఎమ్మార్‌నగరంలో మంగళవారం జగన్నాథ రథోత్సవం వేడుకగా జరిగింది. ఈ ఏడాది కర్రలతో తయారు చేసిన రథం లేకపోవడంతో, ట్రాక్టర్ టెయిలర్‌పై తాత్కాలిక ఏర్పాట్లతో జగన్నాథ, బలరామ, సుభద్ర విగ్రహాలను ఆలయ అర్చకులు మనోజ్‌పండా నేతృత్వంలో గుండిచా మందిరానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. జగన్నాథ దర్శనం కోసం పరిసర గ్రామలతో పాటు ఊరిలోని భక్తులు పోటీపడి తరలి చ్చారు.



పార్వతీపురంలో జగన్నాథ విగ్రహాన్ని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరి

విష జ్వరంతో

# గిరిజన బాలిక మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కుంతాం గిరిజన గ్రామానికి చెందిన పెదకాపు లిడియా (5) విష జ్వరంతో బాధపడుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. లిడియాకు ఈనెల 14న జ్వరం రావడంతో పాచిపెంట పిహెచ్‌సిలో చేర్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటికి తీసుకు రాగా, మళ్లీ 16న జ్వరం తీవ్రం కావడంతో సాలూరు సిహెచ్‌సికి తరలించారు. అక్కడ మూడు రోజులు చికిత్స పొందినప్పటికీ జ్వరం నయంకాకపోవడంతో విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి హుటా హుటిన విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. లిడియా మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు.



మృతి చెందిన లిడియా

**బాలిక మృతిపై ఎంపిపి ఆరా**

ఈ విషయం తెలుసుకున్న పాచిపెంట ఎంపిపి బడ్నాన ప్రమీల మంగళవారం స్థానిక పిహెచ్‌సికి వెళ్లి బాలిక మతిపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అలాగే చిన్నపాటి జ్వరం వచ్చినా నాటు వైద్యుడ్ని ఆశ్రయించి మృత్యువాత పడుతున్నారని, గ్రామాల్లో మూఢనమ్మకాలపై అవగాహన సదస్సులు ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్యం పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈమె వెంట వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరం నాయుడు ఉన్నారు.




సింగిల్ మేజర్ సబ్జెక్టుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

# సింగిల్ మేజర్ సబ్జెక్టులపై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తగా చేరబోయే విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో మంగళవారం సింగిల్ మేజర్ సబ్జెక్టులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2020 నూతన విద్యా విధానంలో భాగంగా ఈ ఏడాది నుంచి డిగ్రీ స్థాయిలో సింగిల్ మేజర్ విధానం అమల్లోకి వస్తుందన్నారు. బిఎ గ్రూపునకు సింగిల్ మేజర్ పొలిటికల్ సైన్స్, మైనర్ సబ్జెక్టు ఎకనామిక్స్ అని, సిబిజెడ్ విభాగంలో బోటనీ మేజర్ సబ్జెక్టు, కెమిస్ట్రీ మైనరని, ఎంపిసిఎస్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ మేజర్ కాగా, లెక్కలు సబ్జెక్టు మైనర్ అని తెలిపారు. 2020 నూతన విద్యా సంవత్సరంలో భాగంగా మొదటి సంవత్సరం మాత్రమే చదివితే సర్టిఫికెట్, రెండో సంవత్సరం వరకు చదివితే డిప్లొమా, మూడేళ్ల పాటు చదివితే బ్యాచిలర్ డిగ్రీ అని అన్నారు. నాలుగో ఏడు కూడా కొనసాగితే డిగ్రీ ఆన్సర్ సర్టిఫికేట్‌ను విద్యార్థి సంపాదించుకోవచ్చన్నారు. 2023 -24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 19న ప్రారంభమైందని, కళాశాలలోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, ఈనెల 24 ఆఖరి తేదీ అని ఆమె తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9490459917, 833 181 7710 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ రామకృష్ణ, అధ్యాపకులు ఉన్నారు.



సిఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న హెచ్ఎం

## ఇంటర్ స్టేట్ టాపర్ శిరీషకు సత్కారం

ప్రజాశక్తి - సీతంపేట

విజయవాడలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా గిరిజన గురుకులం స్టేట్ టాపర్ సీతంపేట బాలిక కళాశాలలో హెచ్ఈసీ గ్రూప్ చదువుతున్న టి. శిరీష కు 950 మార్కులు వచ్చాయి. ఈమెను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సత్కరించారు. లక్ష రూపాయల చెక్కు, ప్రశంసాపత్రం అందజేశారు. ఆమెతో పాటు దోనుబాయి ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పాలక గురునాథ్, సామరిల్లి బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరిక నందిని కూడా నగదు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి సూర్యకుమారి, హెచ్ఎంలు సుబ్బారావు, భాస్కరరావు తదితరులు ఉన్నారు.

## నేడు అఖిల భారత స్కూల్ క్విజ్

ప్రజాశక్తి - భామిని

ఆర్‌బిఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అఖిల భారత ఫైనాన్షియల్ లిటరసీపై నిర్వహిస్తున్న అఖిల భారత స్కూల్ క్విజ్ మండలం స్థాయి పోటీలను స్థానిక జెడిపి హై స్కూల్‌లో ఎపిజివి బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్నామని బ్యాంకు మేనేజర్ సతీస్ తెలిపారు. ఈ పోటీలకు మండలంలోని 13 పాఠశాలల్లో ఎన్నుకోబడిన 26 మంది విద్యార్థులు బుధవారం ఉదయం 10 గంటలకు హైస్కూలుకు చేరుకోవాలన్నారు. ఈ పరీక్షల్లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థి జిల్లా స్థాయి పోటీలకు ఎన్నుకోబడతాడని, మిగిలిన విద్యార్థులకు ఆర్‌బిఐ ధ్రువపత్రాలు అందజేస్తుందని తెలిపారు.

# కాంట్రాక్టర్లు.. అప్పుల పాలు

**గాంధీ కన్న కలలను సాకారం చేస్తామంటూ వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రజల వద్దకే పాలన అందిస్తామంటూ సచివాలయాలు.. రైతులకు అందుబాటులో సేవలంటూ రైతు భరోసా కేంద్రాలు.. గ్రామస్థాయిలో వైద్యమంటూ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. దీని ద్వారా ప్రభుత్వ లక్ష్యం, గాంధీ కన్న కలలు సాకారం అవుతాయో, లేదో కానీ, ఎంతోమంది కాంట్రాక్టర్ల కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. అందుకు నిదర్శనమే మొన్న అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు ఆత్మహత్య, ఏడాది క్రితం బొబ్బిలి మున్సిపాలిటీలో కాంట్రాక్టర్ వెలమల మహేంద్ర మరణాన్ని చెప్పొచ్చు. ప్రభుత్వ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు సర్కారు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారంతా అప్పుల పాలవుతున్నారు. కనీసం వడ్డీలు చెల్లించుకోలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, బిల్లులు చెల్లించేందుకు సర్కారు సాహసించలేదని వారంతా వాపోతున్నారు.**



అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు నిర్మించిన సచివాలయ భవనం

ప్రజాశక్తి -బొబ్బిలి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లో 664 సచివాలయ భవనాలకు రూ.245.55 కోట్లు, 618 రైతు భరోసా కేంద్రాలకు రూ.135.72 కోట్లు, 485 విలేజ్ క్లినిక్ భవనాలకు రూ.84.87 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా భవన నిర్మాణాలు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పూర్తి కాగా, మరికొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. సచివాలయ, రైతు భరోసా, విలేజ్ క్లినిక్‌లు భవనాలను, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ముఖ్య నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి చేస్తున్నారు. తమ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు సకాలంలో బిల్లులు అవుతాయని నమ్మకంతో వడ్డీలకు అప్పులు చేసి పనులు చేసినప్పటికీ సకాలంలో బిల్లులు కాలేదు. ఆయా పనులు చేసిన కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారు. చేసిన అప్పులు తీరకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

**పెరిగిన ఒత్తిడి**

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అప్పుల ఒత్తిడికి గురవుతున్న కాంట్రాక్టర్లు ప్రాణాలు విడుస్తున్నారు. మూడు రోజుల క్రితం బిల్లులు సకాలంలో అవ్వకపోవడంతో బొబ్బిలి మండలం అలజంగి గ్రామ ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ వెలమల మహేంద్రకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అప్పుల ఒత్తిడి పెరగడంతో బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి, మృత్యువాత పడ్డారు. కాంట్రాక్టర్లకు పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తే అప్పులకు ఎక్కువ వడ్డీలు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ నెలల తరబడి

### రుణాల ఒత్తిడితో ప్రాణాలు విడుస్తున్న వైనం

చెల్లించకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరగడంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో అప్పుల ఒత్తిడి పెరిగి మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

**బిల్లులు కాకముందే పిసిల డిమాండ్!**

అవినీతి రహిత పాలన అందిస్తున్నామని చెపుతున్న వైసిపి ప్రభుత్వం సొంత పార్టీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులే అభివృద్ధి పనులకు బిల్లుల కోసం పిసిలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న అభివృద్ధి పనులకు బిల్లులు అవ్వకముందే పిసిలను అధికారులు డిమాండ్ చేస్తున్నారని పేరు చెప్పేందుకు ఇష్టపడని వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వాపోతున్నారు. సచివాలయం, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవన బిల్లులు, రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనుల బిల్లుల కోసం ముందుగానే పిసిలు ఇవ్వాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

**బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్**

సచివాలయం, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవనాలకు, ఇతర అభివృద్ధి పనులకు బిల్లులు సకాలంలో చెల్లించి మానసిక ఒత్తిడి నుంచి కాపాడాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు సకాలంలో చెల్లించాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

## నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి -కలెక్టరేట్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ లోనిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభవుతుందని, కావున అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మానసిక, శారీరక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు యోగాను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.

## మురుగునీరు తొలగింపు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గుమడ గ్రామ సమీపాన అంతరాష్ట్ర రహదారిపై నిల్వ ఉన్న మురుగునీటిని అధికారులు ఎట్టకేలకు తొలగించారు. ఈ సమస్యపై సిపిఎం ఆధ్వర్యాన గ్రామస్తులు నిరసన తెలిపి, అధికారులకు సమస్యను విన్నవించుకున్నారు. ఈ మేరకు అధికారులు స్పందించి రోడ్డు పక్కనున్న మురుగునీటిని తొలగించారు. దీనిపై సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఎంపిడిఒ కార్యాలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమస్య తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



నారా లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

## యువగళం పాదయాత్రలో జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నెల్లూరులో తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రలో కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల టిడిపి ఇంచార్జిలు తోయక జగదీశ్వరి, గుమ్మడి సంధ్యారాణి, నిమ్మక జయకష్ణ పాల్గొని సంఘీభావం తెలిపారు. యువ గళం పేరుతో నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన జగదీశ్వరి తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేపడుతున్న అరాచక పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ పాదయాత్రలో కురుపాం నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు పాల్గొన్నారు.

## రోగులకు సమస్యలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆస్పత్రికి వచ్చే రోగులకు సమస్యలు లేకుండా చూడాలని సర్పంచ్ ఎ.మన్మథరావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అభినవకుమార్, సమరసింహారెడ్డితో ఆయను మాట్లాడుతూ గిరి శిఖర గ్రామాల నుంచి ప్రజలు వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వస్తారని, అటువంటి వారికి ఏ విధమైన సమస్యలు లేకుండా చూసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నీలకంఠాపురం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

## ఘనంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటలో తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి జన్మదిన వేడుకలు టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, కె.తిరుపతిరావు, ఆర్.వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ ఆమె ఆరోగ్యంగా ఉండాలని ఎల్లవేళలా సౌభాగ్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనుల దాహార్తిని తీర్చండి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు కోరారు. మండలంలోని తాడిపాయి గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామంలో తాగునీరు సమస్యతో గిరిజనులు అల్లాడిపోతున్నారని ఐటిడిఎ అధికారులు స్పందించి తాగునీరు సమస్యను పరిష్కరించాలని కోరారు. తాగునీటి సమస్యపై తాడిపాయి సర్పంచ్ సోమేశ్వరరావుతో చర్చించి అనేకసార్లు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారికి వినతిపత్రం అందించినప్పటికీ సమస్య పరిష్కరించలేకపోవడంపై మన్మధరావు ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై వసతి గృహ, వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఎటువంటి అనారోగ్య సమస్యలున్నాయా, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై ఉన్న అవగాహన, పరిజ్ఞానాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. చర్మ సంబంధిత వ్యాధులు దరిచేరకుండా ఎక్కువగా జాగ్రత పడాలని, అందుకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమన్నారు. రక్త హీనత, సీజనల్ వ్యాధు లు, పౌష్ఠికా హారం, రోగ నిరోధకశక్తి ఇలా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యా యులు వి . చినవెూహ న రాయుడు, ఎబివిపి పట్నా యక్, వైద్య సిబ్బంది జయ గౌడ్, పార్వతి, పాఠశాల, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జగన్మోహనరావు

## విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఆణిముత్యాలు పేరుతో ప్రోత్సాహాలు అందిస్తుందని స్థానిక జడ్పీహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు బిడ్డకు బీముడు అన్నారు. ఈ ఏడాది టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఎం.దివ్య, నిడగంటి నందిని, నగదు అందజేశారు.కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై టిడిపి నాయకులకు శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో ఓటరు జాబితాలో పరిశీలన, హౌసింగ్ మ్యాపింగ్‌లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవి అన్నారు. మండలంలోని జోగింపేటలో మండల స్థాయి బూత్ కన్వీనర్లు, గ్రామస్థాయి పార్టీ అధ్యక్షులకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఓటర్లతో ప్రత్యేక సంబంధాలు పెట్టుకోవాలన్నారు. అలాగే ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేసి ఆ ఓటరుకు అనుకూలంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో జరుగుతుందన్నారు. ముందుగా గ్రామాల్లోని కార్యకర్తలు ఓటరు జాబితాల పరిశీలన చేసుకుని జాబితాలో ఉండేవారని కూడా చూడాల్సిన బాధ్యత క్యాడర్‌పై ఉందన్నారు. ఇలా పనిచేస్తే టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, వేణుగోపాల నాయుడు, జిల్లా నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

# పత్తి సాగు పెంచాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి రైతు పత్తి పంటను సాగు చేసి విస్తీర్ణం పెంచడానికి కృషి చేయాలని జిల్లా ప్రకతి వ్యవసాయ అధికారి పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని గుమ్మిడిగూడలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పత్తి సాగు చేసే రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లలోనూ, దళారుల మాటలు నమ్మి బీటీ పత్తి విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. గుర్తింపు పొందిన సంస్థల ద్వారా మాత్రమే నాన్ బీటీ విత్తనాలు కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. గత నాలుగేళ్ల నుంచి గ్రామీణ వికాస్ కేంద్రం స్వచ్ఛంద సంస్థ ద్వారా మండలంలోని రైతులకు నాన్ బిటి విత్తనాలు సరఫరా చేస్తూ పండించే పంటను మార్కెట్ ధర కంటే అధికంగా చెల్లించి అమెరికా వంటి విదేశాలకు ఎగుమతిలు అవుతున్నాయని తెలిపారు. రుతుపవనాలు ఆశాజనకంగా ఉన్నందున రైతులు నాన్ బీటీ విత్తనాలను వరుస క్రమంలో వేసుకుని, సరిహద్దు పంటలుగా ఆముదం, మొక్కజొన్న, జొన్న, అంతర్ పంటలుగా కంది, బంతి, అలసందలు, పెసలు, మినుములు మొదలగు పంటలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయంతో పాటు ఏ విధమైన పురుగులు, తెగుళ్లు ఆశించవని సూచించారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జట్టు కో డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, మండల ఇన్చార్జి ఎం.సీతారాం, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మాస్టర్ ట్రైనర్ నిర్మల, రైతులు పాల్గొన్నారు.



కురుపాంలో రైతులకు నవధాన్యాలను అందజేస్తున్న షణ్ముఖరాజు



గుమ్మలక్ష్మీపురంలో గిరిజన రైతులకు నవధాన్యాలను అందజేస్తున్న ఎఒ ప్రసాద్

**ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి**

**గుమ్మలక్ష్మీపురం :** గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాద్ కోరారు. మండలంలోని గొయిపాక రైతు భరోసా కేంద్రంలో 25 మంది గిరిజన రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రైతు ముందుగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసి నవధాన్యాలను తొలకరి వర్షాలకు ముందుగా భూమిలో జల్లు కోవాలన్నారు. దీనివల్ల భూమి సారవంతం కావడంతో పాటు పంటలకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని అన్నారు. ఖర్చులు తగ్గించుకొని దిగుబడులు పెరగడానికి, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించడానికి నవధాన్యాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని అన్నారు. మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా నవధాన్యాలను వేసుకునేలాకార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. 20 నుంచి 30 రకాల నవధాన్య విత్తనాలను భూమిలో వేసుకోవడం వల్ల అన్ని రకాల పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. ఆర్‌బికెలోని సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిఎ కె.భవాని, సి ఆర్ పి లు కె.మిన్నారావు ,రెడ్డి రావు పాల్గొన్నారు.

## మేనిఫెస్టోపై అవగాహనకే బస్సు యాత్ర

ప్రజాశక్తి - పాచిపెంట

ఇటీవల నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టో గల సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు తెలిపారు. మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఐదు జోన్లుగా విభజించి బస్సులు వేయడం జరిగిందని, ఒక్కొక్క బస్సుకు 50 మంది చొప్పున ముఖ్య నాయకులు ఉంటారన్నారు సాలూరు నియోజకవర్గానికి సంబంధించి ఆర్పీ భంజ్‌దేవ్, గుమ్మడి సంధ్యారాణితో పాటు తాను కూడా బస్సుయాత్రలో పాల్గొంటానని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.1,22,000 అందేలా సంక్షేమ పథకాలు ఉంటాయన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి టిడిపి అధికారంలోకి రావడానికి కృషి చేస్తానని తెలిపారు. సంపద సృష్టించి, ఖర్చు పెట్టే నాయకుడు చంద్రబాబు అని సాలూరు నియోజకవర్గంలో అందరం కలిసికట్టుగా పనిచేసి టిడిపి ఎమ్మెల్యే గెలుపు కైవసం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పిన్నిటి ఈశ్వరరావు, మంచాల పారమ్మ, కొత్తల పోలినాయుడు, సర్పంచ్ సంతోషి, దండి మోహనరావు, గొర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

## 'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రావుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్)అన్నారు. మండలంలోని రావుపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 24 నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనంత ఎక్కువ సేవలందించాలన్నారు. సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. సమస్యలను సంబంధిత పోర్టరులో నమోదు చేయాలని, వాటిపై విచారణ నిర్వహించి, గ్రామంలో పర్యటించే మండల టీం ద్వారా సదరు సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, ముటేషన్లు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బలగ వెంకటసాయికృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి తట్టికోట శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.




పాస్‌బుక్ ప్రింటర్లను ప్రారంభిస్తున్న ఎపిజివిబి ఆర్ఎం రాఘువేంద్ర

## బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా అందజేస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాఘువేంద్ర అన్నారు. మండలంలోని తోటపల్లిలో ఎపిజివిబి శాఖ పరిధిలోని తురకనాయుడు వలసలోని బ్యాంకుమిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాసుబుక్కు ప్రింటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రీజనల్ మేనేజర్ రాఘువేంద్ర మాట్లాడుతూ బ్యాంకు సేవలను మరింత సులభతరం చేసేందుకు, ఖాతాదారుల సౌలభ్యం కోసం ఆయా గ్రామాల్లో సిఎస్‌పిలను ఏర్పాటు చేశామని తెలిపారు. తోటపల్లి బ్రాంచి మేనేజర్ గంట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇకపై సిఎస్‌పిల వద్ద ఏర్పాటుచేసిన ప్రింటర్ ద్వారా పాసుబుక్కు అప్డేట్ చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వాసు, డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

నగర పంచాయతీ పరిధిలోని మెయిన్‌రోడ్డులో కాలువల్లో పూడికతీతలు తీస్తున్నారని అయితే ఈ విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఈ పనులు చేపట్టడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, పూడికతీసిన తర్వాత మురుగునీరు బయటకుపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. అదే విధంగా వర్తకులు ఎక్కడా పూడికతీతలు తీస్తే వారే దగ్గరుండి తీయించుకుంటున్నారని మళ్లీ వారే కాలువలపై పలకలు వేయించుకుంటున్నారని అంతే తప్ప ఇందులో అధికారుల ప్రమేయం ఏమీలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ప్రమాదపుటంచున శిథిల భవనం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 27వ వార్డు కంగటి వారి వీధి శివారున గల నివాస గృహం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో సంబంధిత యజమానులు ఆ శిథిల భవనాన్ని వదిలి వేరే నివాస గృహానికి వెళ్లిపోయారు. దీంతో ఆ భవనం ఏ సమయంలోనైన కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో ఇరుగు, పొరుగు ఉన్న నివాస గృహస్తులు భయాందోళన చెందుతున్నారు. అలాగే ఇదే వీధి నుండి ప్రధాన రహదారికి నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు క్షణక్షణం భయపడుతూ ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు భారీవర్షాలు కురిస్తే ఈ భవనం కూలి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే భవన యజమానికి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, అవార్డు సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీ నోటీసు అందజేసి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న భవనం

## 160 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం సమీపాన రూరల్ ఎస్సై సింహాచలం ఆధ్వర్యంలో ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తున్న బాలగొడబకు చెందిన యలగాడ జయచంద్ర అనే వ్యక్తి అదుపులోకి తీసుకుని 160 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సైతెలిపారు.



## నేరాలు ఘోరాలు

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధుడు మతి చెందిన సంఘటన పార్వతీపురం మండలం నర్సిపురం రైల్వే గేట్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. జిఆర్పి అవుట్ పోస్ట్ ఎఎస్ ఐ రత్న కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సిపురానికి చెందిన శ్రీరాములు (66) పనుల నిమిత్తం పొలానికి వెళ్తుండగా రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

### లారీ ఢీకొని యువకుడు దుర్మరణం



మృతుడు ధర్మ

**పార్వతీపురంరూరల్ :** కొమరాడ మండలం కోటిపాంకు చెందిన వై.ధర్మ(25) లారీ ఢీకొని మృతి చెందాడు. మంగళవారం వేకువజామున తన ద్విచక్రవాహనంపై విశాఖ వెళ్తుండగా, పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్లే ప్రధాన రహదారిపై నర్సిపురం దాటిన తర్వాత రూరల్ పోలీస్‌స్టేషన్ ఏరియా పరిధిలో గుర్తుతెలియని లారీ వెనుక నుండి ఢీకొనడంతో శరీరం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు. కోటిపాంకు చెందిన ధర్మ ఇటీవల విశాఖలోని ప్రైవేటు ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా మారాడు. యువకుడి మృతితో కుటుంబం ఆధారం కోల్పోయి అనాధలుగా మారారని కోటిపాం గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి, విచారణ జరిపి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని అదుపులోకి తీసుకుంటామని ఎస్సై సింహాచలం తెలిపారు.

### ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

**పార్వతీపురంరూరల్ :** జియ్యమ్మవలస మండలం నీచుకువలసకు చెందిన కోడూరు ధనుంజయ అనే యువకుడు మంగళవారం తన చెల్లి, మేనల్లుడితో కలిసి ద్విచక్రవాహనంపై పార్వతీపురం సొంత పనులు నిమిత్తం వస్తుండగా, పట్టణ సమీపంలోని కొత్తవలస ఫ్లైవోవర్ వంతెన ఎక్కుతుండగా, వెనుక నుంచి వేరొక ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో అతని చెల్లెలు మంగమ్మకు, మేనల్లుడు జస్వంత్‌కు గాయాలయ్యాయి. వైద్యసహాయం కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా, మెరుగైన వైద్యం కోసం జిల్లా అసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

**పార్వతీపురంరూరల్ :** కురుపాం మండలం చీడిగూడకు చెందిన తోయక సుశీల తన భర్త వెంకటరావు పిల్లలను పాఠశాలలో చేర్పించే విషయంలో జరిగిన స్వల్ప వివాదంలో భర్త మందలించాడని మనస్థాపంతో మంగళవారం తన ఇంట్లో ఉన్న చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్పందించిన స్థానికులు 108 వాహనంలో జిల్లా అసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

### ఇరుగుపొరుగు గొడవలో మహిళకు గాయాలు

**పార్వతీపురంరూరల్:** పట్టణ పరిధి కొత్తవలస మెయిన్‌రోడ్‌లో కాపురం ఉంటున్న ముచ్చల రమణ అనే మహిళపై మంగళవారం తన పక్క ఇంట్లో నివాసముంటున్న సువ్వాడ పైడిరాజు కుటుంబంతో జరిగిన గొడవలో సదరు కుటుంబం మొత్తం ఆమెపై దాడిచేయగా, గాయపడింది. స్పందించిన స్థానికులు జిల్లా అసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.